క్లుప్తంగా

తెరుచుకున్న దర్గా రైల్వే గేట్

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్‌ను రైల్వే అధికారులు బుధవారం తెరిశారు. దర్గా రైల్వే గేట్ మీదుగా కాజీపేట – వరంగల్ సెక్షన్ల మధ్య మూడవ రైల్వే లైన్ నిర్మాణం కారణంగా దర్గా రైల్వే గేట్‌ను వారం రోజుల పాటు మూసివేశారు. మూడవ రైలు మార్గం నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం నుంచి యధావిధిగా వాహన రాకపోకలకు అనుమతించినట్లు అధికారులు వివరించారు.

ఆర్టీసీ ఆర్ఎంకు సన్మానం

హన్మకొండ: ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన డి.విజయభానును నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సన్మానించారు. హనుమకొండలోని వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఆర్ఎంను ఎన్ఎంయూ వరంగల్ రీజియన్ కార్యదర్శి సీహెచ్.యాకయ్య, పలువురు నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు మాశం శ్రీనివాస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. క్యాస్ట్ లీడర్‌షిప్ అండ్ పాలిటిక్స్ ఇన్ తెలంగాణ స్టేట్ – ఏ స్టడీ షెడ్యూల్డ్ క్యాస్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ హరిప్రసాద్ పర్యవేక్షణలో శ్రీనివాస్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

వీధికుక్కల పట్టివేత

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రహదారులపై గుంపులుగా తిష్టవేసి స్థానికులకు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ప్రజల అభ్యర్థన మేరకు బల్దియా అధికారుల ఆధ్వర్యంలో వీధికుక్కలను బల్దియా సిబ్బంది పట్టుకుని సంరక్షణ కేంద్రానికి తరలించారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

ఖిలా వరంగల్: యువత సమష్టిగా స్వయం ఉపాధితో ఎదుగుతూ మరో పదిమందికి ఉపాధి చూపాలని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాం నాయక్ సూచించారు. వరంగల్ శంభునిపేటలో మిర్జా వసీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజన హోటల్‌ను ఈద్గా ప్రతినిధి జబ్బార్, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఉర్సు దర్గా పీఠాధిపతులు ఉబేద్ బాబా, నవీద్ బాబాతో కలిసి ఏసీపీ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. హస్సన్ అలీబేగ్, రఫిక్, సీహెచ్ యాదగిరి, మసూద్, మాషూక్ పాల్గొన్నారు.

వృత్తి శిక్షణలో రాణించాలి

ఖిలా వరంగల్: నిరుపేద మహిళలు వృత్తి శిక్షణలో రాణించాలని స్థానిక కార్పొరేటర్ పోశాల పద్మ సూచించారు. వరంగల్ 41వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో అల్ రోష్ని సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణను పూర్తిచేసిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి మార్గాన్ని చూపాలనే ఆలోచనతో 45 రోజుల పాటు టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ ఇప్పించడం అభినందనీయమని కొనియాడారు. డాక్టర్ పరికి సుధాకర్, డాక్టర్ షరీఫ్ ఉన్నీసా, షబానా, అజ్మీ, కాంగ్రెస్ నాయకులు అందె సునీల్, షేక్ మున్వర్ పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో భర్త అరెస్ట్

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 21న రాత్రి జరిగిన మక్కల మంజుల (36) హత్య కేసులో మృతురాలి భర్త అశోక్‌ను సుబేదారి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. పోలీసుల విచారణలో మంజులను హత్య చేసింది భర్తే అని తేలడంతో అశోక్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నిజం ఒప్పుకున్నట్లు సమాచారం. దీంతో సుబేదారి పోలీసులు అశోక్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు ఇంకా ప్రకటించలేదు.

హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ వరంగల్ -2 డిపో కార్యవర్గం

హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ -2 డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నూరు శ్రీను, కార్యదర్శిగా ఎండి ఫర్వేజ్, కోశాధికారిగా లక్కం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను హనుమకొండలోని వరంగల్ -2 డిపోలో డిపో మేనేజర్ జి.సురేష్‌కు హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారెపల్లి రాంరెడ్డి బుధవారం పరిచయం చేశారు. మాట్లాడుతూ సంస్థ పరిరక్షణకు అద్దె బస్సుల యజమానులు సహకరించాలని సురేష్ కోరారు.

అర్హతలేని వైద్యులపై కొరడా

కాజీపేట: కనీస విద్యార్హతతో పాటు వైద్యశాఖ అనుమతి లేకుండా గ్రామాలు, పట్టణాల్లో ప్రైవేట్ వైద్యం చేస్తున్న ఆస్పత్రులపై రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ బృందాలు కొరడా ఝుళిపిస్తున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీల పేరిట అందిస్తున్న వైద్యం తీరును టాస్క్‌ఫోర్స్ కమిటీ వైద్యులు అడ్డుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి ఫొటోలు, వీడియోలు తీసి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. ప్రాథమిక వైద్యం మాత్రమే అందించాల్సిన కొందరు చిన్నపాటి ఆస్పత్రులనే నడిపిస్తున్నట్లుగా తనిఖీల్లో వెల్లడైంది.

మాదక ద్రవ్యాలతో జీవితం చిత్తు



హన్మకొండ: ర్యాలీ తీస్తున్న న్యూ విజన్ ఆల్కాహాల్ అండ్ డ్రగ్ డీఅడిక్షన్ సెంటర్ సభ్యులు



ఖిలా వరంగల్: మాట్లాడుతున్న ఏసీపీ నందిరాం



ఆర్ట్స్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

హన్మకొండ: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, ఈ క్రమంలో వాటికి దూరంగా ఉండాలని న్యూ విజన్ ఆల్కాహాల్ అండ్ డ్రగ్ డీఅడిక్షన్ సెంటర్ డైరెక్టర్ ఎ.సురేందర్, కౌన్సెలర్ రాజ్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ సుబేదారిలోని న్యూ విజన్ ఆల్కాహాల్ అండ్ డ్రగ్ డీఅడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కూడలిలో అవగాహన ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాకు వినతి పత్రం అందించారు.

డ్రగ్స్ నిర్మూలనకు పాటుపడాలి

ఖిలా వరంగల్: ఆరోగ్యానికి హానికరమైన డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాంనాయక్ సూచించారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వరంగల్ హంటర్‌రోడ్డులోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథి ఏసీపీ హాజరై మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి, మద్యానికి బానిసై జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకోవద్దని సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని, చైతన్యవంతులై ఆరోగ్యవంతమైన జీవనాన్ని అందుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కేయూ క్యాంపస్: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), మహిళలు, పిల్లలు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కనకయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

విద్యారణ్యపురి: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని, బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం కంది శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసై అనేక మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల సాంస్కృతిక కార్యదర్శి, ఉపాధ్యాయుడు వల్సపైడి, డాక్టర్ వాసు, వ్యాయామ ఉపాధ్యాయులు రాణి, మనోహర్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, సమ్మిరెడ్డి, స్వామి, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రెస్‌క్లబ్ స్పోర్ట్స్ మీట్ -2024



గెలిసిన క్రికెట్ జట్టు సభ్యులతో ప్రెస్‌క్లబ్ నాయకులు, జర్నలిస్టులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ -2024 బుధవారం ముగిసింది. ఈనెల 13న 3కే రన్‌తో ప్రారంభమైన స్పోర్ట్స్ మీట్‌లో చెస్, క్యారమ్, షటిల్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా, కెమెరామెన్స్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన మ్యాచ్‌లో కెమెరామెన్స్ జట్టు 8వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ క్రీడల విజయవంతానికి సహకరించిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాక్షి ఎడిషన్ ఇన్‌చార్జ్ వర్దెల్లి లింగయ్య, జర్నలిస్ట్ సంఘాల నేతలు గడ్డం రాజిరెడ్డి, బీఆర్.లెనిన్, కె.అనిల్ కుమార్, ఎం.సుధాకర్, కేశవమూర్తి, బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, జర్నలిస్టులు, కెమెరామెన్లు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక వృత్తి గౌరవప్రదమైనది



కేయూ క్యాంపస్: సమాజంలో అధ్యాపక వృత్తికి ఎంతో గౌరవ ఉందని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి అన్నారు. కళాశాలలో జువాలజీ విభాగంలో పార్ట్‌టైం అధ్యాపకురాలుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ నాయిని వినీతను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి మాట్లాడుతూ అధ్యాపక వృత్తిలో నిబద్ధత, అంకిత భావం తప్పనిసరి అని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, అధ్యాపకులు శ్రీధర్‌కుమార్ లోథ్, తిరుణహరి శేషు, కరుణాకర్, ఫిరోజ్, లక్ష్మారెడ్డి, అచ్చయ్య, భిక్షపతి, బాలకిషన్, శివకుమార్ పాల్గొన్నారు.

సంగీతోత్సవానికి కలెక్టర్ ప్రావీణ్యకు ఆహ్వానం

హన్మకొండ కల్చరల్: ఈ నెల 29, 30వ తేదీల్లో హనుమకొండ బాలసముద్రంలోని నక్షత్ర కన్వెన్షన్‌లో సప్తస్వర సంగీత అకాడమీ ఆధ్వర్యంలో సద్గురు శివానందమూర్తి ఆరాధన వాగ్గేయకార సంగీతోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనాలని కలెక్టర్ ప్రావీణ్యను కార్యక్రమ నిర్వాహకులు హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో అకాడమి నిర్వాహకులు లాయక్ అహ్మద్, కార్యక్రమ సలహాదారు భద్రకాళి శేషు, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ స్వరూపరాణి, బొంపెల్లి సుధీర్‌రావు, సతీష్, ప్రణయ్ పాల్గొన్నారు.

‘నీట్’పై స్పందించకపోవడం దుర్మార్గం



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ: వైద్య, విద్య ప్రవేశ పరీక్ష నీట్‌లో జరిగిన అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటి వరకూ స్పందించకపోవడం దుర్మార్గమని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీలను నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతున్న బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ అయిందని ధ్వజమెత్తారు. దాంతో దేశంలో 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మంద సుచందర్, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, నాయకులు పల్లపు సురేష్, రమణారెడ్డి, సంతోష్, ఎం.రమేష్, కృష్ణవంశీ, ఎం.సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చరిత్రకు పురాతన కట్టడాలు ఆధారాలు

హన్మకొండ కల్చరల్: పురాతన కట్టడాలు.. చరిత్రకు ఆధారాలుగా నిలుస్తాయని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) అన్నారు. రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయాన్ని తీన్మార్ మల్లన్న బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బోడ డిన్న, రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట దర్గాలో..

కాజీపేట రూరల్: కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గాను ఎమ్మెల్సీ మల్లన్న సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మల్లన్నకు తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్, దర్గా పీఠాధిపతి ఖుస్రు పాషా స్వాగతం పలికి దర్గా వద్దకు తీసుకెళ్లి ప్రార్థనలు చేయించారు. బియాబాని, కార్పొరేటర్లు విజశ్రీ, జక్కుల రవీందర్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్,



రుద్రేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మల్లన్న

హనుమకొండ జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్ మీర్జా అజీజ్‌బేగ్, వరంగల్ జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్ అయూబ్, న్యాయవాది ముద్దస్సిర్ పాల్గొన్నారు.

ఉర్సు పీఠాధిపతులను కలిసిన ఎమ్మెల్సీ

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని దర్గా పీఠాధిపతులు ఉబేద్‌బాబా, నవీద్ బాబాను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బుధవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు.

కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలి



మట్టిపోసి ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కాశిబుగ్గ: కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడి అందులో అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వరంగల్ సీపీఐ మండల కార్యదర్శి బుస్స రవీందర్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను పార్టీ నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ గీసుకొండ మండలం గొర్రెకుంట శివారు 107 సర్వే నంబర్‌లో 12ఎకరాల 25 గుంటల ప్రభుత్వ భూమిలో గత 20 ఏళ్ల క్రితం సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్లు లేని 500 కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటుండగా ప్రభుత్వం వారికి పట్టాలు ఇచ్చి అన్ని సదుపాయాలు కల్పించిందని తెలిపారు. మిగిలిన ఎకరం భూమిలో అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అప్పుడే సర్వే చేసి నిధులు లేకపోవడంతో వదిలేసినట్లు వివరించారు. ఇదే అదునుగా భావించిన కొందరు కబ్జాదారులు ఆ భూమిని చదునుచేసి మట్టి పోయించి అమ్మకాలు జరుపుతున్నారన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మేడిది అశోక్, కొయ్యడ మనోహర్, రాజేష్, షారుక్‌ఖాన్, ప్రదీప్ పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



మడికొండలో నిరసన తెలుపుతున్న నాయకులు



వరంగల్: పోచమ్మమైదాన్ జంక్షన్‌లో..

మడికొండ: పెరుగుతున్న నిత్యావసర ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి విమర్శించారు. మడికొండలోని ఖండాల దాబా హోటల్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని బీజేపీ నాయకులు చెప్పిన హామీలు నీటి మూటలయ్యాయని ధ్వజమెత్తారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పెరిగిన ధరలను తగ్గించకపోతే ప్రజల ఆగ్రహానికి కేంద్రం గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, రాసమల్ల దీన, కొట్టపాక రవి, రాజమణి, సుమన్, స్వరూప, ఐలయ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

వరంగల్: నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ జంక్షన్‌లో నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ధరలను తగ్గించాలని కోరారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు, నిరసనలు చేస్తామని రవి హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ మండల కార్యదర్శి బస్సా రవీందర్, కాశీం, పరికరాల రమేష్, జన్ను రవి, మేడిది అశోక్, రహేలా, స్వప్న, మనోహర్, సామేల్, రాజేష్, విక్టోరియా, రేణుక, నజీమా, వసంతలక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

వరంగల్: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి గత ఆరు నెలలుగా బకాయిలుగా ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ వద్ద ఉద్యోగులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ సత్య శారదాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నెలవారీగా వేతనాలు రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి, జిలా కార్యదర్శి ముక్కెర రామస్వామి, జిలా అధ్యక్షుడు ఉప్పలయ్య, కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి



నిరసన తెలుపుతున్న స్వేరో బాధ్యులు

విద్యారణ్యపురి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా రోడ్డుపై బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ బాధ్యులు రాజు, శివకుమార్, రజనీ, మహేష్ పాల్గొన్నారు.

‘ఎమర్జెన్సీని అమలు చేస్తున్న మోదీ’



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖిలా వరంగల్: మోదీ ప్రభుత్వం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేసి, ప్రజాస్వామ్య ఖూనీ చేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత శ్రీనివాస్, బండి కోటేశ్వరరావు, గుంగుల దయాకర్ ఆరోపించారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని విద్యానగర్‌లో రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అప్పుడు తమ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ పెడితే, ఇప్పుడు హిందూత్వ బ్రాహ్మణీయ ఫాసిజాన్ని మోదీ ప్రభుత్వం అమలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు పూనుకున్నదని అన్నారు. సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, గంధ్రతి హరిబాబు, ఇనుముల కృష్ణ, రంజిత, అక్బర్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

శ్వేతార్కలో సంకటహర చతుర్థి

కాజీపేట: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో మంగళవారం రాత్రి 58 లీటర్ల తేనెతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ తేనెతో అభిషేకం, అర్చనలు, అలంకరణ పూజలు నిర్వహించారు. పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ గణపతి హోమం జరిపించారు. అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

హన్మకొండ: హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ఈనెల 27న జరగనున్న మున్సిపల్ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య పిలుపునిచ్చారు. పబ్లిక్ గార్డెన్‌లోని మలేరియా విభాగం అటెండన్స్ పాయింట్, కలెక్టరేట్, వేయి స్తంభాల దేవాలయం వద్ద మున్సిపల్ కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్, నాయకులు రాజేష్ ఖన్నా, ఎల్లేష్, శానిటరీ జవాన్లు ఎల్లస్వామి, వడ్డమాని శీను, బాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

లీకేజీలకు మరమ్మతు చేయాలి

వరంగల్ అర్బన్: పైపులైన్ లీకేజీలను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని అధికారులను నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. లీకేజీ ఏర్పడిన పోచమ్మమైదాన్ ప్రాంతాన్ని మేయర్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ రంగారావు, రవీందర్, ఏఈ ఉన్నారు.

రోడ్డుపై మందు బాబుల వీరంగం

ఖిలా వరంగల్: మద్యం మత్తులో మందు బాబులు రహదారులపై వీరంగం సృష్టించారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి వరంగల్ శంభునిపేట జంక్షన్‌లో జరిగింది. వర్ధన్నపేట సమీప తండాకు చెందిన జాటోతు నాగన్న కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వరంగల్ నుంచి వర్ధన్నపేటకు నాగన్న కారులో బయల్దేరాడు. శంభునిపేట జంక్షన్‌కు కారు చేరుకోగానే కరీమాబాద్‌కు చెందిన కొంతమంది యువకులు మద్యం మత్తులో ఎదురుపడి ఎందుకు గట్టిగా హారన్ కొడుతున్నావని డ్రైవర్‌ను కిందికి లాగి విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మిల్స్ కాలనీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే, వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్ సమీపంలోని ఓ వైన్‌షాపు ఎదుట మద్యం మత్తులో కొంత మంది బుధవారం పరస్పరం దాడికి తెగబడ్డారు.

మైనర్లు పట్టుబడితే జైలుకే..

హసన్‌పర్తి: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ శ్రీనివాస్ పుప్పాల హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్‌లు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ ఏవీవీ సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రవీందర్, ట్రాఫిక్ సీఐ శుక్రు, ఎంవీఐ కిశోర్‌బాబు, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల బంద్

విద్యారణ్యపురి: ప్రైవేట్ పాఠశాలల్లోని అధిక ఫీజుల నియంత్రించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్లతో ఏబీవీపీ ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపుతో హనుమకొండలోని పాఠశాలలను బుధవారం బంద్ చేశారు. అక్కడక్కడ తెరిచి ఉన్న ప్రైవేట్ పాఠశాలలను ఏబీవీపీ నాయకులు మూసివేయించారు.

సీఎం సలహాదారును కలిసిన రవీందర్‌రెడ్డి

వరంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్ హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాటన్ పరిశ్రమలు, పత్తి రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

పాఠశాలకు ఎన్ఆర్ఐ విరాళం



ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ శ్రీవెంకటేశ్వర పాఠశాల అభివృద్ధికి 1993 – 94లో పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఎన్ఆర్ఐ నుంచి ఆర్థిక సాయాన్ని అభ్యర్థించారు. ఈ మేరకు ఎన్ఆర్ఐ కంచె నవీన్ కుమార్ – హాసిని దంపతులు స్పందించి కంచె కుమారస్వామి చేతుల మీదుగా వెంకటేశ్వర పాఠశాలకు లక్ష రూపాయలను బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్, కార్యదర్శి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ సేవా దృక్పథంతో పేద విద్యార్థుల అభ్యున్నతికి దాతలు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి వనం శ్రీకాంత్, వి.సత్యనారాయణ, దావూద్, అశోక్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.